ప్రతి అడుగు పేదల సంక్షేమం కోసమే

- ప్రతి అర్హుడికి పథకాలు అందిస్తున్నాం
- నూతన పింఛన్ల పంపిణీలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ పోలా



రాజంపేట టౌన్: పింఛన్ పంపిణీ చేస్తున్న ఆకేపాటి

రాజంపేట టౌన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేసే ప్రతి అడుగు పేదల సంక్షేమం కోసమే అని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 223 మందికి నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆకేపాటి, పోలా చేతులమీదుగా పింఛన్ నగదును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో పింఛన్ మంజూరవ్వాలంటే పింఛన్ పొందుతున్న వారు మృతి చెందితేనే వారి స్థానంలో కొత్త వారికి పింఛన్ ఇచ్చే వారని చెప్పారు. అయితే జగన్ సీఎం అయ్యాక ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని తెలిపారు. వలంటీర్ల ద్వారా ఏ ఇంటిలో ఏ పథకానికి అర్హులైన వారు ఉన్నారో గుర్తించి వారికి పథకాలను మంజూరు చేయిస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. పింఛన్‌కు అర్హులైన వారు ఇంటిలో ఇద్దరు ఉంటే ఇద్దరికీ పింఛన్ ఇచ్చే ఆలోచనలో సీఎం ఉన్నారన్నారు. ప్రజలకు మేలు చేసే విషయంలో జగన్ తన తండ్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిలాగే ఎన్ని కష్టాలు ఎదురైనా వెనకడుగు వేయరని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కూడా ప్రజలు జగన్ మద్దతు ఇవ్వాలని కోరారు. మరోసారి జగన్ సీఎం అయితే పేద ప్రజల జీవితాలు మరింత మెరుగుపడతాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఏదైనా పొరపాటు చేస్తే ఇప్పుడు అందుతున్న పథకాలు ఏవి కూడా ఉండవన్నారు.

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అర్హులైన 18 మంది లబ్ధిదారులకు నూతనంగా జగనన్న పింఛన్‌లు మంజూరయ్యాయని సర్పంచ్ ప్రతినిధి తుర్రా ప్రతాప్, వైఎస్ఆర్‌సీపీ నాయకుడు నాగం నరసింహారెడ్డిలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు

వీరబల్లె (రాయచోటి టౌన్) : అర్హతే ప్రమాణికంగా పింఛన్లు అందిస్తున్న ప్రభుత్వం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని వీరబల్లె మండల ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి అన్నారు. గురువారం కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హతను బట్టి కొత్తగా మండల వ్యాప్తంగా మరో 148 పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు.

గృహసారథులకు బీమా ఓ వరం

నందలూరు(రాజంపేట) : గృహసారథులకు ప్రభుత్వం కల్పించిన బీమా ఓ వరమని నందలూరు సచివాలయాల కన్వీనరు, మండల కో–ఆప్షన్ సభ్యుడు కరీముల్లాఖాన్ అన్నారు. గురువారం స్థానిక సమావేశ భవనంలో గృహసారథులకు బీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సయ్యద్‌అమీర్, సూర్యనారాయణ, పల్లె మాధవీ, ఎంపీటీసీ సుభాన్‌బాషా, నాగభూషణం, సోమిశెట్టి ప్రసాద్, పూల సురేష్ పాల్గొన్నారు.

ఉలవలు పంపిణీ

గాలివీడు : ప్రత్యామ్నాయ పంటలపై రైతులు మొగ్గు చూపాలని వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక గాలివీడు–3 రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ అధికారి మురళీధర్ తో కలసి రైతులకు ఉలవలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ రమణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

‘జనసేనను టీడీపీకి అమ్మేశాడు’



రైల్వేకోడూరు : జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తన పార్టీని టీడీపీకి రాజమండ్రి సెంట్రల్ జైలు సాక్షిగా అమ్మేశాడని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ఆరోపించారు. గురువారం రాత్రి విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడికి పవన్‌కల్యాణ్ దత్తపుత్రుడిగా తన బాధ్యతలు నిర్వహిస్తూ ప్యాకేజీకి అమ్ముడిపోయి టీడీపీకి జనసేనను అమ్మేశాడన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమంతో వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక టీడీపీని, చంద్రబాబును లేపడానికి పవన్ తన వంతు ప్రయత్నం చేస్తుండం చూస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. వారు ఎన్ని జిమ్మిక్కులు వేసిన జగన్‌మోహన్‌రెడ్డిని విజయాన్ని ఆపాలేరని ఎద్దేవా చేశారు. జనసేనాని ములాఖత్‌కు వెళ్లి డీల్ చేసుకున్నాడని వాపోయారు. రాజకీయాల్లో పవన్ ఒక బ్రోకర్ అని విమర్శించారు. టీడీపీ, జనసేనల అక్రమ బంధాన్ని ప్రజా కోర్టులోనే తేల్చుకుంటామని పేర్కొన్నారు. చంద్రబాబు చేసిన అవినీతికి మద్దతు తెలిపిన పవన్‌కు 2024లో రాష్ట్ర ప్రజలు రాజకీయ సమాధి కడతారని తెలియజేశారు.

పికప్ వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

రాయచోటి టౌన్ : రాయచోటి – చిత్తూరు రోడ్డులోని రింగ్ రోడ్డు వద్ద ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలో పల్సర్ బైక్‌ను అశోక్ లైలాండ్ పికప్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో చలపతి (45) అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ కథనం మేరకు.. గురువారం రాత్రి సంబేపల్లె నుంచి రాయచోటికి చలపతి అనే వ్యక్తి పల్సర్ బైక్‌పై వస్తుండగా, వెనుక నుంచి అశోక్ లైలాండ్ పికప్ వాహనం వచ్చి ఢీకొనడంతో బైకర్ అక్కడిక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి కన్నీటి వీడ్కోలు

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లెకు చెందిన గిరీష్ అంత్యక్రియలు నిర్వహించారు. తమ కుమారుడును డాక్టర్ చేయాలన్న ఆ తల్లిదండ్రుల కోరిక, ఆశయం, యూరప్‌లోని జార్జియాలో మెడిసన్ చేయించిన ఆ తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేరుస్తూ ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. ఆ విద్యార్థి ఈ నెల చివరిలో ఇంటికి వచ్చేస్తాడనగా సెప్టెంబర్ 1న గుండెపోటు రూపంలో ఆ విద్యార్థి ప్రాణాలు తీసుకుపోయాడు భగవంతుడు. గిరీష్ కుటుంబ సభ్యులు సంతోషాలను పంచుకునే లోపే దుఃఖం పంచుకోవాల్సి వచ్చింది. ఆ తల్లిదండ్రులు ఆర్తనాదాలు చుట్టుపక్కల వారిని కన్నీటి పర్యంతం చేశాయి. కొడుకు మృతదేహం కోసం 12 రోజులుగా ఎదురు చూశారు. ఎట్టకేలకు గిరీష్ మృతదేహం బుధవారం రాత్రి స్వగ్రామం చేరుకుంది. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గురువారం మృతదేహానికి బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుత్ సబ్ స్టేషన్ తనిఖీ

సంబేపల్లె : మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను గురువారం జిల్లా విద్యుత్‌శాఖ అధికారి ఎస్ రమణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సబ్ స్టేషన్ ఆవరణమంతా పరిశీలించారు. ఆపరేటర్ల పనితీరుపై ఆరాతీసి వారికి సూచనలు, సలహాలు చేశారు.

పంట నమోదు తప్పనిసరి

చిన్నమండెం : మండల పరిధిలోని చాకిబండ, మల్లూరు, వండాడి, గ్రామాల్లో జరుగుతున్న ఈ క్రాప్ పంట నమోదును గురువారం జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ రైతులు పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పంట నమోదు వలన ప్రభుత్వం ద్వారా అందించే ఇన్సూరెన్స్, సీడ్ మెజర్‌మెంట్, క్రాప్ డ్యామేజ్ వంటి ఆర్థికసాయం చెల్లిస్తుందని రైతులకు తెలిపారు. పంట నమోదు అనంతరం ఈకేవైసీ కూడా తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చిన్నమండెం మండల వ్యవసాయాధికారిణి గీత, ఏఈఓలు అనూష, రేణుక, వీఏఏ శివాంజనేయులు, అఫ్రీన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లెకు ఇబ్బందులు లేకుండా కాలువల నిర్మాణం

రాయచోటి అర్బన్ : పట్టణంలోని కొత్తపల్లె ప్రాంత ప్రజలకు వర్షపు నీటితో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కాలువలను నిర్మించాలని మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా అధికారులకు సూచించారు. వర్షపునీటితో తాము పడుతున్న ఇబ్బందులను కొత్తపల్లె వాసులు ఎమ్మెల్యే దృష్టికి వెళ్లారు. దీంతో మున్సిపల్ చైర్మన్ ఆర్అండ్‌బీ అధికారులతో కలసి సుండుపల్లె ప్రధానమార్గంతో పాటు కొత్తపల్లె వీధులలో పర్యటించారు. వర్షపునీరు పెద్దఎత్తున ప్రవహించే ప్రాంతాల్లో తిరుగుతూ ఆయా ప్రాంత ప్రజలను పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహబూబ్ బాషా వీధి, అలీమాబాద్‌వీధి, కాలేజీ వెనుకభాగం వీధిల నుంచి పెద్దఎత్తున వచ్చే వర్షపునీరంతా పండ్లమండీలు, షిఫా హాస్పిటల్‌ల పక్కనుండి కొత్తపల్లె వీధుల్లోని ఇళ్లలోకి వెళుతున్న విషయంపై మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్ రౌనఖ్‌హుస్సేన్‌లు అధికారులతో సమీక్షించారు. ఈ ప్రాంతంలో వర్షపునీరంతా కొత్తపల్లె వీధులలోకి చేరకుండా మురుగునీటి కాలువలతో అనుసంధానం చేయాలంటూ సూచించారు. వర్షపు నీటిని జాతీయరహదారి మురుగునీటి కాలువ కు మళ్ళిస్తే కొత్తపల్లె ప్రజలకు వర్షపు వరదనీటి ముప్పు తప్పుదంటూ అధికారులు నిర్ణయానికి వచ్చారు. విషయాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి ఫోన్ ద్వారా వివరించారు. ఆయన సుముఖత చెప్పడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తపాలాశాఖ పథకాలు సద్వినియోగం చేసుకోండి

లక్కిరెడ్డిపల్లి : తపాలాశాఖ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లి సీఐ వరప్రసాద్ కోరారు. లక్కిరెడ్డిపల్లి సబ్ పోస్టాఫీసు ఆవరణలో గురువారం జరిగిన జనంలోకి మనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలందరూ తపాలాశాఖలోని వివిధ పొదుపు పథకాలు, జీవిత బీమా తదితర ఉపయోగించుకోవాలని సూచించారు. ఎస్ఐ మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ సుకన్య సంవృద్ధి యోజన,మహిళా సన్మాన యోజన పథకాలు చాలా బాగున్నాయన్నారు.



వ్యవసాయంలో సాంకేతికతపై అవగాహన

చిట్వేలి : శ్రీలక్ష్మీ శ్రీనివాస పరస్పర సహకార సంఘం, ఉద్యానశాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం పెరుగుతున్న టెక్నాలజీపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదర్భంగా జిల్లా ఉద్యానాధికారి రవింద్రబాబు మాట్లాడుతూ ఉద్యానపంటల నుంచి వచ్చే పంట ఉత్పాదకాలు గురించి, ఉద్యానశాఖలో అమలవుతున్న పథకాలు గురించి వివరించారు. మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఫ్రూట్ కవర్లవాడకం, కాల్తార్ వాడకం తగ్గింపుపై చీనీ, నిమ్మ పరిశోధనలపై శాస్త్రవేత్త శ్రీనివాసులు రెడ్డి క్లుప్తంగా వివరించారు.

21న రాజంపేటలో జిల్లా స్థాయి పోటీలు

రాజంపేట టౌన్ : యువజనోత్సవాల్లో భాగంగా రాజంపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 21వ తేదీ ఉదయం 9 గంటల నుంచి వివిధ అంశాల్లో జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహించనున్నట్లు స్టెప్ ముఖ్య కార్యనిర్వహణ అధికారిణి సాయి గ్రేస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జానపద నృత్యం (గ్రూప్, సోలో), జానపద గేయం (గ్రూప్, సోలో), ఫొటోగ్రఫీ, పోస్టర్ మేకింగ్, స్టోరీ రైటింగ్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తిగల వారు ఈనెల 18వ తేదీలోపు http://tinyurl.com/dyfanmy2023 వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9949298810, 8074305134 నెంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

చిన్నమండెం : మండల పరిధిలోని కొత్తపల్లి పంచాయతీలోని శ్రీనివాసపురం రిజర్వాయర్ డ్యాంలో జరిపే వినాయక నిమజ్జన ఏర్పాట్లను రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా గురువారం పరిశీలించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమంపై పోలీసు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. డ్యాం ఆవరణాన్ని పరిశీలించి నిమజ్జనానికి అడ్డుగా ఉన్న కంపచెట్లను తొలగించాలని తెలిపారు. రాయచోటి అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, రాయచోటి రూరల్ సీఐ తులసీరాం, హెడ్ కానిస్టేబుల్ ఓబులేసు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

ఓబులవారిపల్లె : మండలంలోని ముక్కవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండలస్థాయి క్రీడా పోటీలను ఎంఈఓ పద్మజ ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముక్కా సాయివికాస్ రెడ్డి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాపోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ముక్కా సాయివికాస్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు బుజ్జమ్మ, ఎంఈఓ రెడ్డయ్య, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి జి.ఆదినారాయణరెడ్డి, సర్పంచ్ అరవ శ్రీధర్, ఉపసర్పంచ్ రామసుబ్బారెడ్డి, బత్తిన వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మృతి

ఒంటిమిట్ట : సిద్దవటం మండలం మార్కెటింగ్ యార్డ్ కమిటీ వైస్ చైర్మన్ ముమ్మడి శ్రీధర్ రెడ్డి గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుండగా, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాలు ఇలా.. మండల పరిధిలో సాలాబాద్ గ్రామానికి ముమ్మడి శ్రీధర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన మృతి చెందాడన్న వార్తతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీధర్‌రెడ్డికి భార్య, కూతురు ఉన్నారు. శ్రీధర్‌రెడ్డి అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం జరుపనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఏపిటీఎస్ ఫస్ట్ ఫేజ్‌లో 94 శాతం సీట్లు భర్తీ

రాజంపేట : ఏఐటీఎస్ ఫస్ట్ ఫేజ్ కౌన్సిలింగ్‌లో 94 శాతం సీట్లు భర్తీకావడం తనకెంతో ఆనందంగా ఉందని ఏఐటీఎస్ అధినేత, ఏపీ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పా గంగిరెడ్డి అన్నారు. గురువారం తన చాంబరులో విలేకర్లతో మాట్లాడుతూ ఏఐటీఎస్‌పై విద్యార్థులు, వారి తల్లితండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడం వల్లనే ఈ రోజున రాయలసీమలోనే ఒక ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు.

వీరజవాన్ల స్మారకార్థమే అమృతవనం

నందలూరు(రాజంపేట) : దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, వీరజవాన్ల స్మారకార్థం న్యూఢిల్లీలో నరేంద్రమోడీ అమృతవనం నిర్మిస్తున్నారని బీజేపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. మేరి మిట్టీ మేరి దేశ్ కార్యక్రమంలో భాగంగా నందలూరు మండలం చింతకాయలపల్లెలోని స్వాతంత్ర్య సమరయోధులు తట్బా వెంకటరాఘవచార్యులు, అండాలమ్మ మనవడు మురళిస్వామి ఇంటికి వెళ్లి అమృతవనం కోసం మట్టిని సేకరించారు.

ఘనంగా హిందీ దివస్

చిన్నమండెం : ఆదర్శ పాఠశాలలో గురువారం హిందీ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నరసింహులు తెలిపారు. 1949లో భారత ప్రభుత్వం సెప్టెంబర్ 14న హిందీని రాజభాషగా చేసిందన్నారు.

పుల్లంపేట: మండల పరిధిలోని టి కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గురువారం జాతీయ హిందీ భాష దినోత్సవాన్ని హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

నందలూరు (రాజంపేట) : హిందీ భాషను దేశంలో ఎక్కడైనా ఉపాధి పొందవచ్చని పాటూరు జెడ్పీహెచ్ఎస్ ప్రిన్సిపల్ మాధవీలత తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

సిద్దవటం : బెటాలియన్ లోని జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం హిందీ భాష దినోత్సవం వేడుకలను ఉపాధ్యాయుడు సమీర్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించినట్లు ఎంఈఓ శంకరయ్య తెలిపారు. ఎంఈఓ మాట్లాడుతూ భారత జాతీయ ఉద్యమంలో అఖిల భారతాన్ని జాగృతం చేసి, ఏకతాటిపై నడిపేందుకు హిందీ భాష ఆనాడు దోహదం చేసిందన్నారు.

గాలివీడు : హిందీ భాష దేశాన్ని ఏకం చేసిందని జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయులు తెలిపారు. గురువారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు.